

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, అన్ని రంగాలలో వారు ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని కలెక్టర్ డా.జి. లక్ష్మీ శ అన్నారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఆడపిల్లల పరిరక్షణకై గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం - 1994 అంశపై నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలలో పాల్గొని గెలుపొంది జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన మొత్తం తొమ్మిది మంది ప్రభుత్వ పాఠాశాలల పిల్లలకు కలెక్టర్ చేతుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీహరి, జిల్లా విద్యా శాఖ అధికారి వి.శేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని, డిపిఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముందే 'మండే'..!

ఫిబ్రవరిలోనే సుర్రుమంటున్న సూరీడు
రాత్రి చల్లదనం, పగలు మండుటెండలు
పగటిపూట 33- 35 డిగ్రీల నమోదు
ఇళ్లల్లో, ఆఫీసుల్లో ఏసీల వాడకం మొదలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఫిబ్రవరి తొలినాళ్లలోనే సూరీడు సుర్రుమంటున్నాడు.. సహజంగా శివరాత్రికి చలి 'శివశివ' అంటూ పోయి, వేసవి ప్రారంభమయ్యేది. అయితే గడిచిన నాలుగైదేళ్లుగా వాతావరణంలో సంభవించిన పెనుమార్పుల వల్ల ఫిబ్రవరి చివరిలోనే ఎండలు మండుతూ వస్తున్నాయి. కరోనా సమయంలో వేసవి కొంత కనికరం చూపింది. అయితే ఈ ఏడాది భానుడి ప్రతాపం ఎక్కువేనని వాతావరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసింది. దీనికితగ్గట్టే ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు మండుతున్నాయి. తిరుపతి జిల్లాలో పగటిపూట 33-35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్లల్లోనూ, ఆఫీసుల్లోనూ ఏసీలు 'ఆన్' అయ్యాయి.

ఈ ఏడాది వేసవి ముందే వచ్చేసింది. ఫిబ్రవరి మూడో వారం ఇంకా రానే లేదు. అపుడే భానుడి ప్రతాపం కనిపిస్తోంది. గతంలో మార్చి 15వ తేదీ నుంచి ఎండాకాలం మొదలయ్యేది. విద్యార్థులకు ఒంటి పూట బడులు అప్పుడే మొదలయ్యేది. ఈసారి వాతావరణంతో ఫిబ్రవరి నెల ఏమాత్రం పగటిపూట చల్లగా ఉండడం లేదు.

ఏప్రిల్ ,మే నెలల్లో 40-47 డిగ్రీల మధ్య

ఫిబ్రవరి నెలలోనే ఉష్ణోగ్రతలు ఎక్కువ మొదలు కావడంతో ఏప్రిల్, మే నెలలో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంటున్నారు. గత ఏడాది తిరుపతిలో మే నెలలో 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలు ఉన్నాయి. ఈసారి ఏప్రిల్ ,మే నెలలో పగటి పూట ఉష్ణోగ్రతలు కొంత వరకు పెరిగే అవకాశం ఉన్నాయి. తిరుపతి నగర విస్తీర్ణంలో భాగంగా ఏటేటా పచ్చదనం తగ్గిపోతూ ఉండడంతో ఉష్ణోగ్రతలు పెరిగి వేడి గాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. తిరుపతి నగరంలో విచ్చలవిడిగా సిమెంట్ రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు ఎక్కువగా నిర్మించడం జరిగింది. ఇటీవల కాలంలో నగరంలో డబుల్ డెక్కర్ బస్సు తిరిగేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద వక్షాలను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఏదిఏమైనా ప్రకృతి సమతుల్యత పాటించకపోవడం వల్ల 'మాడి'పోక తప్పదు. తాగునీటి సమస్యా తలెత్తే ప్రమాదం ఉంది.

డిఎస్‌సి అభ్యర్థులకు అప్రెంటిస్ 'షాక్'

ప్రజాశక్తి తిరుపతి సిటీ

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఎట్టకేలకు డీఎస్సీ విడుదల అయ్యిందని సంతోషిస్తున్న అభ్యర్థులకు అప్రెంటిస్ పేరుతో గుదిబండ వేసింది. మెగా డీఎస్సీ ఆశలు ఆవిరైనా, కనీసం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని సంబరపడుతున్న అభ్యర్థులను ప్రభుత్వ తీరు నిరాశపరిచింది.

నిరుద్యోగులను ఆదుకుంటాం, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం, భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ గత ఎన్నికల ముందు అధికార పార్టీ నేతలు బీరాలు పలికారు. కానీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు పరిపాలించినా ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. పైగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన మెగా డీఎస్సీ ఊసే ఎత్తలేదు. ఉన్నత చదువులు చదువుకొని, వేల రూపాయల ఖర్చు చేసి ప్రత్యేక శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఉసూరుమన్నారు. తమ చదువుల కోసం కుటుంబ సభ్యులు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగాయి, తమ వయసు పెరుగుతుందే గాని, ఉద్యోగం దొరకటం లేదని ఆవేదన చెందారు. ఉన్నత చదువులు చదువుకొని కుటుంబాల పోషణ కోసం విధి లేని పరిస్థితిలో కూలికి వెళ్లినవారూ లేకపోలేదు. ఈ దశలో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, రానున్న ఎన్నికలను దష్టిలో పెట్టుకొని, నిరుద్యోగుల ఓటు బ్యాంకు ను రాబట్టేందుకు డీఎస్సీ ని విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. అది కూడా 6వేల పోస్టులకే పరిమితం చేయడంతో 60 వేల పైగా ఉన్న అభ్యర్థులు దిక్కుతోచని పరిస్థితిలో చిక్కుకున్నారు. ఉన్న కాడికి సర్దుకుందామంటూ దింపుడు కల్లం ఆశతో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు, ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఎప్పుడో 12 ఏళ్ల క్రితం రద్దు చేసిన అప్రెంటిస్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ స్థితిలో ఏం చేయాలో అర్థం కాని అయోమయ పరిస్థితిలో అభ్యర్థులు ఉన్నారు. డీఎస్సీ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి విధుల్లో చేరిన తర్వాత 2 సంవత్సరాలు అప్రెంటిస్ చేయాలి. ఈ రెండు సంవత్సరాలు బేసిక్ వేతనంలో 50శాతం మాత్రమే చెల్లిస్తారు. ఇప్పటికే ఉన్నత చదువులు చదువుకొని, లక్షలాది రూపాయలు వెచ్చించి, సంవత్సరాల తరబడి ఎదురు చూసి, ఉద్యోగాలకు అవసరమైన వయో పరిమితులు కూడా దాటేస్తున్న పరిస్థితి నిరుద్యోగులది. తల్లిదండ్రుల ఇచ్చే కాస్తోకూస్తో పాకెట్ మనీతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల తమ ప్రతిభకు పదును పెట్టి, అహర్నిశలు కష్టపడి, ఉద్యోగం సంపాదించినా మరో రెండేళ్లు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో డీఎస్సీ అభ్యర్థులు మనోవేదన తీవ్రమౌతుంది.

అప్రెంటిస్ పునరుద్ధరణ సరైనది కాదు : నారాయణ, డిఎస్‌సి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు అప్పటి పాలకులు అధికారులతో చర్చించి, డీఎస్సీ అభ్యర్థుల అభ్యర్థన మేరకు డీఎస్సీ అప్రెంటీస్ విధానం సరైనది కాదని నిర్ణయానికి వచ్చి రద్దు చేశారు. దాదాపు దశాబ్దం తర్వాత, అది కూడా కరోనా వంటి విపత్కర పరిస్థితులు తర్వాత దాన్ని పునరుద్ధరించడం సరైనది కాదు. దీనివల్ల డీఎస్సీ కి ఎంపికైన అభ్యర్థులు చాలా నష్టపోతారు. ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించాలి.

రోడ్డు భద్రత అవగాహన ప్రచార ర్యాలీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ప్రచార ర్యాలీని సోమవారం నిర్వహించారు. స్థానిక తిరుపతి డిపో వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీకి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుయ్యారు. డివియం ఎం భాస్కర్, డిపో మేనేజర్ టి బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి : జేఈవో

తిరుపతి సిటీ : భక్తులకు మరింత ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలోని తన కార్యాలయంలో అధికారులతో సోమవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, టీటీడీ ఆలయాలతో పాటు అలిపిరి వద్ద పచ్చదనాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ ఖాళీ స్థలాల్లో మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డెప్యూటీ ఈవో గోవిందరాజన్, డిఎఫ్వో శ్రీనివాస్, రవాణా విభాగం జియం శేషారెడ్డి, డిఈవో భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

14-16 తేదీల్లో దక్షిణ భారత సంగీత నృత్యోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ వేంకటేశ్వర సంగీత, నత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14 నుంచి 16వ తేదీ వరకు తిరుపతి మహతి కళామందిరంలో కళావైభవం పేరిట దక్షిణ భారత సంగీత నత్యోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీకష్ణ లీలావిలాసం, శ్రీరామ కథాసారం, భక్త ప్రహ్లాద యక్షగానం తదితర నత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

నూతన ఎస్పీగా మల్లికా గార్గ్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి జిల్లా ఎస్పీగా మల్లికా గార్గ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీగా పని చేస్తున్న పరమేశ్వర్ రెడ్డి ఒంగోలుకు బదిలీ కావడంతో, ఒంగోలు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న మల్లికా గార్గ్ తిరుపతి జిల్లా ఎస్పీగా నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు దష్టి సారించి, అందుకు తగ్గట్టుగా కషి చేస్తానని తెలిపారు. రాబోవు సాధారణ ఎన్నికలే తన ముందున్న పెద్ద టాస్క్ అని ఆమె వెల్లడించారు. అసాంఘిక కార్యక్రమాలపై కొరడా ఝులిపిస్తానన్నారు.

ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి గౌరవ వందనం

ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు వెళ్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి స్థానిక పోలీస్ మైదానంలో పోలీస్ సిబ్బంది, అధికారులు పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం ఇచ్చారు. పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో, పరిపాలనలో సహాయ సహకారాలు హోంగార్డ్ స్థాయి నుండి ఉన్నత అధికారుల వరకు అందించారన్నారు. తాను చేసిన సూచనలు పాటిస్తూ పోలీసు వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడంలో కషిచేసిన అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోలీస్ కవాతు వాహనంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కూర్చోబెట్టి జిల్లా పోలీసు యంత్రాంగం వాహనానికి పూలతాడును కట్టి లాగుతూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, రాజేంద్ర పాల్గొన్నారు.

శెట్టిపల్లి ప్లాట్లపై 'దొంగాట' వద్దు

2 సెంట్ల స్థలం లబ్దిదారులకివ్వాలి
తీర్మానం చేయకపోతే 'కార్పొరేషన్' ఎదుట 'టెంట్'
మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి ప్లాట్ల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దొంగాట్లాడటం మానుకోవాలని, వెంటనే కౌన్సిల్ ఏర్పాటు చేసి, లబ్దిదారులకు రెండు సెంట్ల స్థలం కేటాయిస్తూ తీర్మానం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టెంట్ వేయడానికి వెనుకాడేది లేదని, ఆమరణ నిరాహారదీక్షకైనా లబ్దిదారులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శెట్టిపల్లి పేదల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాకు శెట్టిపల్లి బాధితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కమిషనర్ అదితి సింగ్ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ టి.మోహన్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ శెట్టిపల్లిలోరెండు సెంట్లు తక్కువ కాకుండా ప్రతి ఒక్కరికి ప్లాట్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ ను నియమించి పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు సంబంధించి నిధులను కేటాయించాలన్నారు. పెండింగ్ లో ఉన్న సర్వే నంబర్లకు సంబంధించిన ప్లాట్లలకు ప్రొసీడింగ్స్ కాపీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం , కమిటీ నాయకులు రాధాకష్ణ , ఎన్ శ్రీనివాసులు , ఏ.సురేష్, జయచంద్ర ,శివరాత్రి వీరభద్రయ్య, రాజేంద్ర , కొట్టిడి సురేష్, కుమార్ నాయుడు, రోజా రాణి, హేమలత, ప్రభాకర్ ప్లాట్లు యజమానులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి ప్లాట్ల బాధితులు

వేసిన రోడ్డే వేయడం..పైపై మెరుగులు దిద్దడం..

గుంతల రహదారి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వేసిన రోడ్డునే మళ్లీ వేయడం... బాగున్న రోడ్డుకి మెరుగులు దిద్దడం వంటి తంతు తిరుపతిలో షరా మామూలయ్యింది. అధికార పార్టీ అనుచరులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఇలాంటి పనులకు తెరదీయడం గమనార్హం.

జేబులు నింపుకునే పనిలో కాంట్రాక్టర్లు

అందుకు నిదర్శనమే స్విమ్స్, బర్డ్ ఆసుపత్రి వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు. స్విమ్స్ ఆస్పత్రి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బర్డ్ ఆసుపత్రి మీదుగా శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయ ఆసుపత్రి వరకు తాజాగా అధికారులు తారు రోడ్డు నిర్మాణాన్ని సోమవారం చేపట్టారు. ఈ రోడ్డు ఆరు నెలలకు ముందే నిర్మించడం గమనార్హం. ప్రస్తుతం ఆ రోడ్డు బాగానే ఉన్నా, దానిపై మళ్లీ కొత్త రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంలో ఉన్న రోడ్డుకు పట్టుమని 20 మీటర్ల దూరంలో ఆంధ్రప్రదేశ్ ఔషధాల సరఫరా కేంద్రంకు ఎదురుగా రోడ్డు బాగా పాడైపోయి గుంతల మయం అయింది. దాన్ని బాగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా తమ తీరు మార్చుకొని కాంట్రాక్టర్కు లబ్ధిచేకూర్చే పనులు పక్కనపెట్టి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాడైన రోడ్డులు మరమ్మత్తు పూర్తి చేయాలని, వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

ఇటీవల వేసిన రోడ్డుకు మళ్లీ మెరుగులు

చెరువులో నుంచి జాతీయ రహదారికి ఏర్పాటు చేసిన రహదారి

జాతీయరహదారికి కూతవేటులోనే..

చెరువులో 'రాజ'మార్గం

- రెవెన్యూ ప్రేక్షకపాత్ర
- ఇరిగేషన్ 'మౌన'వ్రతం

ప్రజాశక్తి - ఓజిలి

జాతీయ రహదారికి ఆనుకుని కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి రహదారి ఏర్పాటు చేసుకుని అక్రమంగా రాజమార్గం సృష్టించుకుంటే రెవెన్యూ యంత్రాంగం ఎప్పటిలానే ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. ఇరిగేషన్ అధికారులు లేఖ రాసి 'మౌన'వ్రతం పాటిస్తున్నారు. కనీసం 'హెచ్చరిక' బోర్డులు కూడా పెట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీంతో అధికార పార్టీకి చెందిన ఓ కురువృద్ధుడు రాజకీయ అండదండలతో దర్జాగా ఆక్రమించుకున్న చెరువు స్థలాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఓజిలి మండలం రాచపాళెం చెరువు పోరంబోకు భూముల నుంచి ఏకంగా జాతీయ రహదారికి రాజమార్గాన్ని ఏర్పాటు చేసుకున్నాడు ఓ ప్రబుద్ధుడు. భూమిలేని నిరుపేదలు కొంత భూమిని సాగు చేసుకుంటుంటేనే పోలీసు బలగాలతో హుటాహుటిన విచ్చేసి నిమ్మచెట్లను ఏర్లతో సహా పీకేసి రెవెన్యూ యంత్రాంగం కబ్జాదారునికి మాత్రం కొమ్ముగాస్తోంది. ఈ అక్రమ మార్గం వల్ల ఓజిలి పెద్దచెరువుకు నీరు అందించే ప్రధాన కాల్వ మట్టితో కప్పేయబడింది. దీంతో పెద్దచెరువుకు నీరు చేరే అవకాశమే లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

కొత్త తహశీల్దార్ దృష్టికీ తీసుకెళతాం : బి.శ్రీనివాసులు, ఇరగేషన్ ఎఇ

చెరువు భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారి విషయమై గత తహశీల్దార్ శివరామ సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లాం. తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే గత తహశీల్దార్ బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్ దృష్టికీ తీసుకెళతాం.

16న గ్రామీణబంద్‌ను జయప్రదం చేయండి

రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

అఖిల భారత సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు ఈనెల 16న జరగనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం బిఎన్ కండ్రిగలో రైతుసంఘం, సిఐటియు, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త సమావేశం జరిగింది. దాసరి జనార్ధన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు నల్లచట్టాలను రద్దు చేస్తామని పార్లమెంట్‌లో ప్రకటించినా దొడ్డిదారిన అమలు చేస్తోందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయ రంగంలో చొరబడకుండా రైతులకు మేలు చేసినపుడే స్వామినాథన్‌కు నిజమైన నివాళని తెలిపారు. ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ పేదల కడుపు కొడుతున్నారని విమర్శించారు. రమేష్, రమణయ్య, కత్తిధర్మయ్య, మురళి, మణి, పోలయ్య, పద్మ, చంద్రమ్మ, మారయ్య పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో.. గడియారం స్తంభం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు జోగిశివకుమార్, రమణయ్య, సురేష్, అడపాల ప్రసాద్, వెంకటరామిరెడ్డి, కాలేషా ప్రభాకర్ పాల్గొన్నారు.

నేనంటే...నేనే..!

టిడిపి బరిలో జెడి, హెలెన్
సత్యవేడు టిక్కెట్ రేస్‌లో ఆరుగురు

ప్రజాశక్తి - నాగలాపురం

సత్యవేడు టిడిపి ఎంఎల్ఎ టిక్కెట్ రేస్‌లో ప్రధానంగా ఆరుగురు పోటీ పడుతున్నారు. ప్రధానంగా జెడి రాజశేఖర్, డాక్టర్ హెలెన్ 'నేనంటే నేనే' అని నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. మరి అధిష్టానం చూపు ఎవరిపై ఉంటుందో వేచి చూడాల్సిందే. వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలంకు ఆ పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇవ్వకపోవడంతో 'నాన్ లోకల్'కు ఈ సీటును కేటాయించారు. ఈ నేపథ్యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఎవరిపై కరుణ చూపుతారో అన్న ఆసక్తి టిడిపి శ్రేణుల్లో నెలకొంది.

జెడి, హెలెన్

2019 ఎన్నికల్లో టిడిపి తరపున జేడీ రాజశేఖర్‌కు చంద్రబాబునాయుడు టికెట్ కేటాయించారు. 2014 ఎన్నికల్లో ఓటమిపాలైన ఆదిమూలం 2019 ఎన్నికల్లో 47వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత కొంతకాలంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై జేడీ నిరసనలు తెలుపుతూ గ్రామాల్లో పర్యటించారు. అయితే సత్యవేడు టిడిపి ఇన్‌ఛార్జిగా మాజీ ఎంఎల్ఎ హేమలతను అధిష్టానం నియమించింది. నెలరోజులకే హేమలత కుమార్తె హెలెన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఓ వైపు హెలెన్, హేమలత, మరోవైపు జేడీ రాజశేఖర్ వేర్వేరుగా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అయితే వీరిద్దరి మధ్య సయోధ్యను మాత్రం అధిష్టానం కుదర్చలేకపోయింది. దీంతో రెండు గ్రూపులుగానే టిడిపి సత్యవేడులో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వారిద్దరిని కాదని కొత్తవారిని తెరపైకి తెస్తే మంచిదని ఆశావాహులు సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్ పారిచందన స్రవంతి, రాజేష్‌కృష్ణ, సత్యవేడు మాజీ ఎంఎల్ఎ తలారి ఆదిత్య టికెట్ రేస్‌లో ప్రయత్నాలు ముమ్మరంచేశారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి పనపాక లక్ష్మి తన భర్తకు సత్యవేడు టికెట్ కావాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇదంతా ఒక ఎత్తయితే సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం తాజాగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు నారా లోకేష్‌ను కలవడమూ ఆశావాహుల్లో గుబులు నెలకొంది. ఏదిఏమైనా ఆశావాహులందరినీ ఏకతాటిపైకి తెస్తారో లేదో వేచి చూడాలి. లేదంటే టిడిపికి 'స్వతంత్ర' అభ్యర్థుల పోరు తప్పదు.

తిరుపతి కార్పొరేషన్ అదనపు కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగర పాలక సంస్థ నూతన అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషని మర్యాద పూర్వకంగా కలిశారు. గత ఆరు నెలల నుంచి తిరుపతి మున్సిపల్.కార్పొరేషన్ అదనపు కమిషనర్ పోస్ట్ ఖాళీగానే వుంది. చరణ్ తేజ రెడ్డి జిల్లా ఆడిటింగ్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చారు.

బిఎన్ కండ్రిగ తహశీల్దారుగా అలీఖాన్

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నూతన తహశీల్దారుగా పిఎండి అలీ ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా చెన్నూరు మండలం నుండి వారు బదిలీపై ఇక్కడికి వచ్చారు. డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు గురునాథం, కిరణ్, వీఆర్వో సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అందరూ కలిసి కొత్తగా అలీఖాన్‌ను దుశ్శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

పులివర్తి వినిల్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా చంద్రగిరి టిడిపి ఇన్‌ఛార్జి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ సోమవారం కూరపర్తి వారిపల్లి పంచాయతీలో 'మీ ఇంటికి మీ పులివర్తి నాని' కార్యక్రమం నిర్వహించారు. నేడు రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, రౌడీయిజం, ఇసుక, భూ ఆక్రమణలు, ఎర్రచందన స్మగ్లింగ్ తప్ప అభివృద్ధి ఏమీ లేదని ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో పులివర్తి నానిని చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే పేద, బడుగు, బలహీన వర్గాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజీలు, తలకోన ఆలయాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం మరింత అభివృద్ధి చేస్తామని, డీకేటి భూములను రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆదిలక్ష్మి గిరిజన కాలనీ ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం చేసిన పొంగలి, కోడి గుడ్డు కుర్మా రుచి చూచి వాటిపై సలహాలు, సూచనలు ఇచ్చి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు రుచికర, నాణ్యమైన కూరగాయలతో భోజనం పెట్టాలన్నారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబులు పరిశీలించి వాటి పనితీరు గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా తెలిపారు. 10 వతరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

కోట : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని మండల విద్యాశాఖ అధికారి ధారా మస్తానయ్య అన్నారు. సోమవారం కోట మండలంలోని వంజివాక మెయిన్,హెచ్ డబ్ల్యు మండల ప్రజా పరిషత్ స్కూల్ లో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎలా చదువుతున్నారనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్నం మిడ్డే మీల్స్ నిర్వహణ సక్రమంగా ఉందా.. లేదా?' అనే కోణంలో పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, జి పద్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

టిడిపి నాయకుడిని కలిసిన గంగా ప్రసాద్

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారి సత్రం మండల టిడిపి అధ్యక్షులు వేమ సాని శ్రీనివాసులు నాయుడు ఇటీవల తల్లిని కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న టిడిపి ప్రముఖ నాయకుడు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ సోమవారం మండల పరిధిలోని సింగనాలత్తూరు గ్రామం వెళ్లి వేమ సాని శ్రీనివాసులు నాయుడును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు మోహన్ రావు, కన్వీనర్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్, స్పందన' కార్యక్రమంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్ సోమవారం వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. అర్జీలను, ఫిర్యాదులను కమిషనర్ దృష్టికి తీసికెళ్లి పరిష్కరిస్తామన్నారు. సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 46 సమస్యలపై ఫిర్యాదులు అందాయి. వీటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీ ర్ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

వైసిపికి ఓటమి తప్పదు: జనసేన

ప్రజాశక్తి -గూడూరు రూరల్: రాబోయే ఎన్నికలలో గూడూరు నియోజక వర్గంలో జనసేన, టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు అన్నారు. సోమవారం అడవికాలని ప్రాంతంలో జనంలోకి జనసేన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అధికార వైసిపి ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నిలదీస్తే తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజల తమ ఓటుతో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్మ, అలిమేలు రాజ శేఖర్, అవినాష్, సనత్, సునీల్ కుమార్, శ్రీనివాసులు చైతన్య, వరుణ్ తేజ్, రఘుల్, వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు: సీఈఓ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలన్నా, రైతులు అధిక లాభాలు ఆర్జించాలన్నా ప్రకృతి వ్యవసాయం ఉత్తమమైనదని తిరుపతి జిల్లా రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు పేర్కొన్నారు. ఆయన దొరవారిసత్రం మండల పరిధిలోని విఎంఆర్ నగర్, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఐదు గురి రైతులతో కలిసి వారు సాగు చేస్తున్న వ్యవసాయ పద్ధతి విధానాన్ని సందర్శించారు. 20 సెంట్లు పంట భూమిలో పలు రకాల పంటలు సాగు చేసి నెలసరి ఐదువేల రూపాయల నుండి పదివేల వరకు రాబడి వచ్చే విధానం గురించి అవగాహన కల్పించారు. అన్ని విధాలా లాభదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిపిఎం షణ్ముగం, బివిఎల్ఎంపి పట్టాభి రెడ్డి, జిల్లా యాంకర్ రవిచంద్ర ప్రసాద్, మెంటర్స్ వెంకటేశ్వర్లు, కల్పన, స్వామి కొండలు, పాల్గొన్నారు.

'పద్మవిభూషణ్ చిరంజీవి స్ఫూర్తి'

ప్రజాశక్తి -గూడూరు రూరల్: దేశంలోనే సినీ అభిమానులను సేవా రంగం వైపు మళ్లించిన ఏకైక సినిమా కథానాయకుడు పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి, ఆయనను ఆదర్శంగా తీసుకుని తాము సేవా రంగంలో కొనసాగుతున్నామని అఖిల భారత చిరంజీవి యువత నాయకులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. పద్మ విభూషణ్ పొందిన చిరంజీవిని హైదరాబాద్‌లోని సినీటీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం నుంచి ఆత్మకూరు ఐ బ్లడ్ క్యాంపు నిర్వహించి రికార్డ్ స్థాయిలో రక్తదానం చేసి పలుమార్లు అభిమానులను, రక్తదాతలను ప్రోత్సహించిన తీగల చంద్రశేఖర్ రావుని చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

ప్రజాశక్తి - ఓజిలి: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మండల పరిధిలోని పెద్దపరియ రాచపాలెం గ్రామస్తులు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీఎస్టీ లకు కేటాయించిన భూములను ఓ పెత్తందారుడు కొనుగోలు చేసి ఉన్న మేత పోరంబోకు భూములను కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విల్లమలపాడు నుండి వచ్చే సహజసిద్ధమైన నీటి కాలువను తన భూముల్లో కలిపేసుకున్నాడని తెలిపారు. మేత పోరంబోకు భూముల్లో మూగజీవాలను వెళ్లనివ్వకుండా చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారని. అక్రమ ఆక్రమణలపై తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బలిజ భవనానికి భూమి పూజ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక దక్షిణ కైలాస నగర్ లో సోమవారం బలిజ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ట, నేడు బలిజ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. పలువురు కాపు నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు ఎగ్గొట్టింది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బాలాయపల్లి : కాంట్రాక్టర్ల పనులు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు ఎగ్గొట్టి వీధిన పడేలా చేసిందని ఉమ్మడి రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి దుయ్యబట్టారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో కట్టిన బిల్లింగ్ లకు బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లను అప్పు తీసుకొచ్చి ప్రభుత్వానికి అప్పు ఇచ్చినట్లు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల డబ్బుతో సంక్షేమ పథకాలు నడుపుతున్నారా? అని ఎదేవాతో పథకాలను ప్రచారానికి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ అరుణ, ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తున్న పేదలు

ప్రజాశక్తి -రేణిగుంట : తపతమ గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ పంచాయతీలోని వివేకానంద కాలనీ పేదలు వివేకానంద కాలనీ ఇళ్ల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్ పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వివేకానంద కాలనీ వాసులు, సిపిఎం నాయకులు కలిసి పేదల అర్జీలు అందజేశారు. పేదలు పెట్టుకున్న ఇంటి స్థలాల అర్జీలకు పక్క మండలాల్లో కేటాయించిన జగనన్న పట్టాల లబ్ధిదారులను వెంటనే విచారణ చేపట్టి వివేకానంద కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లోనే ఇంటి పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించుకోవడానికి రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వాలని డిప్యూటీ తాసిల్దార్ గారిని స్థానిక ప్రజలు కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ జగనన్న పట్టాలు ఇచ్చి నాలుగున్నర సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు రేణిగుంట, కరకంబాడి పంచాయతీ పేదలకు స్థలాలు చూపించలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ మండలంలో ఉన్న వందల ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జాదారులు ఆక్రమించి ఇళ్లు కట్టేసి అమ్ముకుంటుంటే పట్టించుకోని రెవెన్యూ అధికారులు, పోలీసులు పేదలు వేసుకున్న గుడిసెలను దౌర్జన్యంగా కూల్చివేశారని, స్థానిక మహిళలను సిపిఎం నాయకుల పై కేసులు పెడతామని బెదిరించడం దుర్మార్గమని అన్నారు. స్థానిక వివేకానంద కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలు, మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని లేనిపక్షంలో పేదలకు అండగా సిపిఎం పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సెల్వరాజ్, కరకంబాడి ఇండ్ల సాధన పోరాట కమిటీ నాయకురాలు సత్య శ్రీ, వివేకానంద కాలనీ ఇండ్ల సాధన పోరాట కమిటీ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సాహిత్యాన్ని పిల్లలు ఇష్టంగా చదవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : పిల్లల్లో సాహిత్యం పట్ల ఇష్టం పెంపొందించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి తెలుగు అధ్యయన శాఖలో తెలుగు సాహితీ సమితి ఉపన్యాసం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టరు వై. సుభాషిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ1994 నుంచి నేటికీ కూడా సాహితీ సమితి కార్యక్రమాలు ఈ శాఖలో నిర్విఘ్నంగా ముందుకు సాగుతున్నాయన్నారు. పిల్లల్లో సాహిత్యం పట్ల ఇష్టాన్ని పెంపొందించుకోవడం, పిల్లల్లో దక్షతని, ఇష్టాన్ని , నిర్దిష్టతని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పెద్దల నుంచి నేర్చుకున్న విషయాలను, రేపటి తరాలకు అందించాలనేదే ధ్యేయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వక్తగా గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో, సంస్కృత అధ్యాపకులుగా ఉన్న డా. కే. కోటేశ్వరయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన సంస్కృత పంచ మహాకావ్యాలు అనే అంశంపై ప్రసంగించారు. పిల్లలు సాహిత్య విలువలను అందిపుచ్చుకోవాలన్నారు. తెలుగు సాహితీ సమితి కార్యక్రమానికి సలహాదారుగా విచ్చేసిన డాక్టరు డి యువశ్రీ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలిపే శాఖ అధ్యయన శాఖ అన్నారు. సాహితీ సమితి కార్యక్రమానికి మంచి స్ఫూర్తి ప్రదాతలు చెప్పే విషయాలు ప్రధానమైనవని, అలాంటి వారితో సందేశం ఇప్పించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు బి.లక్ష్మీ ప్రియ, ఎన్ సుమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

మ్యాజిక్ బస్ ఇండియా ద్వారా ఉద్యోగ అవకాశాలు

శ్రీవిద్య కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నిరుద్యోగ యువతీ యువకులకు మ్యాజిక్ బస్ ఇండియా నేషనల్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించుకోవచ్చని శ్రీవిద్య కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి ప్రైవేటు హోటల్లో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి స్టాక్ హోల్డర్స్ మీటింగ్- 2024ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్యాజిక్ బస్సు ఇండియా నేషనల్ డైరెక్టర్ ఆర్తి సింగ్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలోనూ తమ సంస్థ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు.కల్పిస్తుందన్నారు. ఇప్పటివరకు లక్ష ముప్పై వేల మంది మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వచ్చే ఏడాది చివరకు సుమారు ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయతిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విద్యా డిగ్రీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఇలాంటి సంస్థల వల్ల గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువత నైపుణ్యాలను అందిపుచ్చుకొని మంచి ఉద్యోగాలు పొంది తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడు నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్లేస్మెంట్ ఆఫీసర్లు, హెచ్ ఆర్ మేనేజర్లు పాల్గొని మ్యాజిక్ బస్సు సంస్థతో ఉద్యోగాల కల్పనకు ఒప్పందం కుదుర్చుకున్నారు. నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగాలు పొందిన కొంతమంది యువకులు తమ అనుభవాలను ఈ వేదిక ద్వారా వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తిరుపతిలోని ఆర్. సిఆర్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, రైల్వే కోడూర్ సాయి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ పెంచలయ్య, కే.ఎం. ఎం కళాశాల ప్రిన్సిపాల్, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు, చిత్తూరు జిల్లా మ్యాజిక్ బస్సు ఇండియా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలపింగ్ ప్రోగ్రాం

జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- నారాయణవనం: ఏఐసిటిఇ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ అటల్ ద్వారా ఫెడరేటెడ్ లెర్నింగ్ ఎంపవరింగ్ సెక్యూరిటీ అండ్ డిసెంట్రలైజెడ్ ఎఐ అప్లికేషన్స్ పై వారం రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌ను ఆ కళాశాల అధినేత డాక్టర్ కొండూరు అశోక్ రాజు, వైస్ ఛైర్ పర్సన్ డాక్టరు ఇందిరా వేణి , డైరెక్టర్ డాక్టర్ పి సుబ్బరాజు , కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె చంద్రశేఖర్ రెడ్డి , డాక్టర్ ఎం జనార్ధన్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిజి గోపీనాథ్, సి ఎస్ఈ హెచ్ఓడి అండ్ ప్రొఫెసర్ డాక్టర్ బి గీతా వాణి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కె అశోక రాజు మాట్లాడు తూ ఇలాంటి ఇన్నోవేటివ్ ఎఫ్‌డిపిల నిర్వహణకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. దేశం నలువైపులా నుంచి వచ్చిన 100 మందికి పైగా అధ్యాపకులకు శుభాభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా డాక్టర్ టి రాధాకృష్ణ ప్రొఫెసర్ ఎమెరిటస్, అడ్వైజర్ ఎ న్ బి టి ఇ టి తెలంగాణ , రిసోర్స్ పర్సన్ డాక్టర్ జి రామకృష్ణ, అసోసి యేట్ ప్రొఫెసర్, ఐఐటీ తిరుపతి పాల్గొని అధ్యాపక బృందానికి ఫెడరేటెడ్ లెర్నింగ్ ప్రాముఖ్యత , ఉపయోగాలు , మార్కెట్ అవసరాల గురించి చాలా క్షుణ్ణంగా వివరించారు.ఈ ఎఫ్‌డిపి నిర్వహణకు కృషి చేసిన కన్వీనర్ డాక్టర్ బి గీతావాణి, కో ఆర్డినేటర్ డాక్టర్ ఆరుముగం సురేష్‌ని , డాక్టర్ ఆర్‌జి కుమార్ ని అందరూ అభినందించారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ వుండాలి: ఎంఈవో

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ఉండాలని డిఈవో శేఖర్ పేర్కొన్నారని నాగలాపురం ఎంఈవో బాబయ్య అన్నారు. డీఈవో ఆదేశం మేరకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నూతన స్కౌట్స్ అండ్ గైడ్స్ బిగినర్స్ కోర్స్ శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా విచ్చేసిన నాగలాపురం ఎంఈవో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవశ్యకతను వివ రించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాల నుండి అత్యధిక స్కౌట్స్ అండ్ గైడ్స్ కు సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరికి జిల్లా ట్రైనింగ్ కమిషనర్ జి వెంకటేశ్వర్లు, ఎంఎం రెడ్డి, బాల్య ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ, ఓర్పు సహనం, శారీరక అభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యేక అవగాహన కల్పించారు. 80 యూనిట్ రిజిస్ట్రేషన్లు చేశారు. జిల్లా కార్యదర్శి జయరాం, జిల్లా వైస్ ప్రసిడెంట్ ఎం కుప్పి రెడ్డి జిల్లా కార్యనిర్వాహణ గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈకార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పేర్కొన్నట్లు ప్రతి స్కూలులో యూనిట్ రిజిస్ట్రేషన్ సమగ్ర వంతంగా నిర్వహించాలని జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ పూర్తి బాధ్యతగా ఏ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం ఈఓ రాజు, ఫిజికల్ డైరెక్టర్ బాబు, గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ భువనేశ్వరి, రోవర్స్ అండ్ రేంజర్స్ డిస్టిక్ కో ఆర్డినేటర్ శాంతకుమారి పాల్గొన్నారు.

స్కౌట్సఅండ్ గైడ్స్ బిగినర్స్ కోర్సు శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్ ఉపాధ్యాయులు

జ్వర పీడితులకు రోగ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నేలపట్టు దళితవాడలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా పలువురు జ్వరాలు బారిన పడ్డారన్న సమాచారంతో వైద్యాధికారి చైతన్య సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేపట్టి, డెంగ్యూ, మలేరియా జ్వరాల నిర్ధారణకు ఆర్‌డిడి కిట్ పరీక్షలు నిర్వహించారు. పలువురికి చికెన్ ఫాక్స్ సోకడంతో జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యాధికారి వారికి తెలిపారు. సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి, జ్వరాలు బారిన పడిన వారి జాబితాను తయారు చేశారు. వారికి అవసరమైన మందు లు అందించి, ఆరోగ్య విద్యతోపాటు, కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటూ, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చైతన్య, పంచాయతీ కార్యదర్శి ప్రణయ్, పిహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ విజిటర్ మైథిలి, ఏఎన్ఎంలు వెంకమ్మ, వజ్రమ్మ, ఆరోగ్య కార్యకర్తలు విజయ్ కుమార్, సుధాకర్, ఆశలు సుభాషిని, నిరోషా పాల్గొన్నారు.

జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అభివృద్ధి చేసి చూపిస్తాం: కిషోర్ నాయుడు

ప్రజాశక్తి- చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు పంచాయతీలో నిర్వహించిన ఇంటింట టిడిపి, బాబు ష్యూరిటీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని విధాలా నష్టపోయామని 2024 ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ఆరూరులో అడుగడుగునా విశేష స్పందన లభిస్తోందన్నారు. ఆరూరు పంచాయతీలో ఎంపీటీసీని, సర్పంచ్‌ను గెలిపించుకున్నట్లే సునీల్ కుమార్‌నుఊ గెలిపించుకోవాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. సైకో జగన్మోహన్ రెడ్డిని త్వరలో ఇంటికి సాగనంపాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు పట్టుదలతో కృషిచేసి చంద్రబాబు నాయుడుని, పాశం సునీల్ కుమార్‌ని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మండల సర్వసభ్య సమావేశంలో రగడ

హౌసింగ్ అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రచ్చుమొదలై గందరగోళంగా మారింది. ఎంపీడీవో బాధ్యతలు చేపట్టిన తరువాత నిర్వహించిన మొదటి సమావేశంలోనే హౌసింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో హౌసింగ్ అధికారి ఇచ్చిన పొంతన లేని సమాధానాలతో గందరగోళం నెలకొంది. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నిర్మించుకున్న ఇళ్లకు సకాలంలో బిల్లులు చేయడం లేదని హౌసింగ్ ఏఈ కాంతారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశయంతో పేదలకు జగన్ అన్న ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందని అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పథకం నీరు కారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేయాలని సూచించారు. రానున్న వేసవి కాలంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు చెంగల్ రెడ్డి, తహశీల్దారు, ఎంపీడీవో, సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద ఆదివారం అర్ధరాత్రి రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి గిరిపురానికి చెందిన ఏకాంబరం (యువకుడు) మృతి చెందాడు. ఏకాంబరం ద్విచక్ర వాహనంపై తన సొంత ఊరు పూతలపట్టు మండలం కిచ్చన్నగారిపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా ఐతేపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి.-బుచ్చినాయుడుకండ్రిగ: అప్పుల బాధతో రైతు ఆతహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన వెంకటేశు(38) అప్పుల బాధతో మృతి చెందారని తమ కుంటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మృతుడు కుమారుడు కిషోర్ తన తాతయిన సహదేవనాయుడుతో కలసి సోమవారం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ సహయకులు నాగరాజుకి వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ కుమారుడు వెంకటేశు సమారు రూ. 15లక్షలు పైగా వ్యవసాయానికి, ఇద్దరి కుమారుల చదువుల కోసం" అప్పులు చేశారు. అయితే తనకున్న కొద్దిపాటి డీకేటి పొలంలో గత కొన్ని సంవత్సరాలుగా అప్పులు చేసి పంటలు వేసినా పంట చేతికి రాక అప్పులు చేశాడు. దీనికి తోడు తన ఇద్దరు కుమారులకు అయిన అప్పులు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి తేవడంతో ఏమి చేయాలో తెలియక మానసిక వేదనతో నాకుమారుడు వెంకటేశు ఈ నెల 8వ తేదీ తన పొలంలోకి వెళ్లి క్రిమిసంహకార మందు' తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు విషయం తెలుసుకుని శ్రీకాళహస్తిలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదిన మృతి చెందారని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు సహనంతో సేవలందించాలి : పట్టాభిరామ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఉద్యోగులు సహనంతో సేవలు అందించాలని ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బివి.పట్టాభిరామ్ సూచించారు. తిరుపతిలోని శ్వేత భవనంలో సోమవారం టీటీడీ ఉద్యోగులకు "విధినిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం ఎలా" అనే అంశంపై డాక్టర్ పట్టాభిరామ్ శిక్షణ నిర్వహించారు. టీటీడీ ఉద్యోగులు ఒత్తిడిని అధిగమించేందుకు మన ఆలోచనలను, పని విధానాన్ని మార్చుకోవడం, ఇతరులతో గౌరవప్రదంగా మాట్లాడడం, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవడం, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలు మన ఆధీనంలోనే ఉంటాయన్నారు. ఉద్యోగులకు నైతిక ప్రవర్తన చాలా ముఖ్యమన్నారు. శ్వేత సంచాలకులు భూమన్ మాట్లాడుతూ ఆసక్తి గల ఉద్యోగులు శేషాచలంలోని తీర్థాలను దర్శించుకునేలా త్వరలో ట్రెక్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికష్ణ యాచేంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సీవీఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రజల గుండెల్లో నిలిచిపోతారు: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోతారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కెరోజా అన్నారు. పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్‌పురంలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనంను మంత్రి ప్రారంభించారు. గ్రామాభివృద్ధి చేస్తున్న మంత్రికి స్థానిక మహిళలు గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ మునివేలమ్మ, వైస్ ఎంపీపీలు విమలమ్మ, ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్. ఎంపీటీసీలు సర్పంచులు కోఆప్షన్ సభ్యులు, పార్టీ కన్వీనర్ సచివాలయ కన్వీనర్, ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం పరిశుభ్రత, ఆరోగ్య ప్రాముఖ్యత, అల్బెండజోల్ మాత్రలు , సిరప్‌లపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొని అల్బెండజోల్ మందులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎం. విద్యావతి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ గంగా భవాని, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.అనన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మక విద్యను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన విద్యను అలవర్చుకోవాలని అమరాన్ హాస్పిటల్ అత్యవసర విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ రెడ్డి అన్నారు. సోమవారం ఏ రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో పారామెడికల్ విద్యార్థులకు దాసరి ఆడిటోరియంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ అనే వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. ఈ వర్క్ షాప్ లో పారామెడికల్ విభాగాధిపతి డాక్టర్ మానస్ చక్రవర్తి, ఎం బి యు రిజిస్టర్ ఆచార్య సారథి, డాక్టర్ చంద్రకళాధర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మఠం స్థలంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాంజీ మఠానికి చెందిన స్థలంలో నగరంలోని చిరు వ్యాపారులు అనుమతులు లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకొన్నారని, భవిష్యత్తులో మఠం భూమికి రక్షణ లేకుండా పోతుందనే ఉద్దేశంతో మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు ఆదేశాలతో ఏఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ దుకాణాలను, తడికల షెడ్లను తొలగించారు. తిరుపతి -తిరుచానూరు ప్రధాన మార్గా న్ని ఆనుకుని ఉన్న తిరుపతి పట్టణ లెక్క దాఖల సర్వే నెంబరు 54 లో గల 11 ఎకరాల హథీరాంజీ మఠం భూమి ఉంది. కాగా ఆక్రమణల తొలగింపు సమ యంలో సిపిఐ నాయకులు అక్కడికి చేరుకొని చిరు వ్యాపా రులకు మద్దతుగా నిలి చారు. మఠం భూములు అన్యాక్రాంతం అవుతున్న స్థలా లను గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసు కోవాలని డిమాం డ్ చేశారు. ఈ తొలగింపు కార్యక్రమంలో మఠం సిబ్బంది సీతారాం, మధు, తులసి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట గ్రామ పంచాయతీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మేకలత్తూరు లలితా కరుణాకర్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. "ఎన్ఆర్ఐవిఏ - పుస్తక మిత్ర "సంస్థ ద్వారా మొత్తం 835 పుస్తకాలను అందించారు. ఈ పుస్తక ప్రదర్శ నలో ఉపాధ్యా యులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లపై చర్యలు ఇంకెప్పుడు? - పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి) : వైసీపీ అరాచక పాలన తో ప్రజలు విసుగు చెందా రని, ఓట్లు వేసిన ప్రజలే ఈ ప్రభుత్వం మాకొద్దు మహాప్రభో అంటు న్నారని చిత్తూరు జిలా టిడిపి పార్ల మెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవా రం తిరుపతి రూరల్ మండలం గాంధీ పురం పంచాయ తీలో' మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని' బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని ప్రజా సమస్యలను అడిగి తెలుసు కున్నారు.

పాస్‌పోర్టు పోయినది

పులకంటి పరమేశ్వరయ్య, తండ్రి పులకంటి కృష్ణయ్య నా పాస్‌పోర్టు నెం.**J7871799** పోయినది. నేను 10.05.2023న తిరుపతిజిల్లా, వెంకటగిరి మండలం, సుంకరవారిపల్లి నుండి వెంకటగిరి వస్తుండగా మార్గ మధ్యలో నా పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. కావున నాపాస్‌పోర్టు ఎవరికైన కనపించిన యెడల నాఅడ్రసు:- సుంకరవారిపల్లి, చెలికంపాడు గ్రామపంచాయితి, వెంకటగిరి మండలం.నాఫోన్ నెంబరు **6302829657** చేయగలరని కోరుకుంటున్నాను.

దావా నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 1358/2022

M/S గురురాజా ఇండస్ట్రీస్ ఒంగోలు ... వాది

వర్సెస్

శ్రీ శ్రీనివాస స్పన్‌పైప్స్ కంపెని శెట్టిపల్లి ....ప్రతివాది

To

శ్రీ శ్రీనివాస స్పన్‌పైప్స్ కంపెని,
శెట్టిపల్లి, రేణిగుంట, రిప్రజెంటెడ్ బై ఇట్స్
ప్రొప్రైటర్ అగరాల జగన్ మోహన్‌రెడ్డి
తండ్రి ఈశ్వర రెడ్డి, డోర్ నెంబర్ : 1-5-559,
బాలాజీ కాలని,తిరుపతి 517502

పై నంబర్‌న వాది ప్లెయింటు పరిహార నిమిత్తము మీపై దావా దాఖలు చేసి ఉన్నారు సదరు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల తేది 25-03-2024న ఉదయం 10:30కి పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల తెలుపుకోవలసినది లేనియెడల మీ పరోక్ష ముందు తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : 08.02.2024

ఇట్లు
చుండూరి వెంకట్రావు
వాది తరపు న్యాయవాది
ఒంగోలు